
కథ

చావు గురించి తెలియనప్పుడు ఒక మనిషి తన తండ్రిపోయాడని ఏడవలేదని అనుకోవటంలో అర్థంలేదు. మా నాన్న చనిపోయినప్పుడు నా తమ్ముడు చిన్నవాడు. మూడవ తరగతి చదువుతున్నాడనుకుంటాను.

ఐస్‌క్రీమ్ కప్పు చేతికిస్తే ఆనందపడడం, చేతిలో వున్న చాక్లెట్‌ను లాక్కుంటే ఏడవటం తప్పించి ఏమీ తెలియని అమాయకత్వం. అటువంటి వాడు మా నాన్న పోయినప్పుడు కనీసం కంటతడి కూడా పెట్టలేదని మా బంధువులు కొంతమంది అనుకోవటం నేను విన్నాను. అలాంటి నా తమ్ముడు విరూపాక్ష పెరిగి పెద్దవాడయ్యాడు. ప్రయోజకుడయిన కొద్దీ వాడిలో తనకు తండ్రిలేని లోటు బాగా తెలిసివచ్చింది. తండ్రి గురించిన తపన మొదలయ్యింది.ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో వుంటున్నా వాడూ నేను ఎప్పుడు కలుసుకున్నా ఎక్కువగా మా నాన్న గురించే మాట్లాడేవాడు. మా నాన్న గురించి నన్ను అడిగి ఎన్నో విషయాలను తెలుసుకునేవాడు. నేను కూడా మా నాన్న గురించి, నా చిన్నతనంలో మానాన్న తన చిన్నతనం గురించి నాకు చెప్పిన విషయాలను వాడికి వివరంగా చెప్పేవాడిని. ఆసక్తిగా వినేవాడు.

# నాన్న నడిచిన నేల

## ప్రతాప రవిశంకర్



ఒకసారివాడు ''నేను కొంచెం పెద్దవాడినయిన తర్వాత నాన్నపోయి వుంటే బావుండేది. కనీసం ఏడ్చేవాడినేమో... నాన్న రూపం కూడా గుర్తులేదు. దురదృష్టవంతుడిని '' అన్నాడు.

నిజమే. తండ్రి తన పట్ల చూపుతున్న ప్రేమను కూడా గుర్తించలేని వయసులో వాడు తండ్రి ప్రేమకు దూరమయినాడు.

నా తమ్ముడు పుట్టక ముందు మేము మా స్వగ్రామంలో వుండేవాళ్లం. అది ఒక పల్లెటూరు కాబట్టి అందరికంటే పెద్దవాడినయిన నా చదువు నిమిత్తం ఆ వూళ్లో వున్న ఆస్తులను అమ్ముకుని గుంటూరుకు వచ్చేశాం. అందు వల్ల విరూపాక్ష మేం చెప్పుకుంటున్నప్పుడు వినడమే కాని మా స్వగ్రామాన్ని ఎప్పుడూ చూడలేదు. వాడు పెద్దవాడయినా కొన్నిసార్లు నేను ఒక్కడినే ఆవూరు వెళ్లాను గానీ వాడిని తీసుకువెళ్లలేదు.

మానాన్న గురించిన బెంగ వాడిలో మొదలయిన తర్వాత మా నాన్న పుట్టిపెరిగిన వూరిని చూడాలనే బలమైన కోరిక వాడిలో కలిగినట్టుంది.

ఈ మధ్య నేను వాడి దగ్గరకు వెళ్లినప్పుడు నాతో అన్నాడు.

''నాకు మన స్వగ్రామానికి ఒకసారి వెళ్లాలని వుంది, తీసుకెళతావా?''

''ఎందుకురా? '' అడిగాను.

''నాన్న పుట్టి పెరిగిన వూరినీ, నాన్న నడిచిన నేలనీ చూడాలని వుంది. ఒకసారి మన వూరువెళ్లి అక్కడి వేణుగోపాలస్వామి గుళ్లో ఆకు పూజ కూడా చేయించివద్దాం. ఎప్పటినుంచో అనుకుంటున్నాను. ఒక్కసారి తీసుకువెళ్లు'' అర్థింపుగా అడిగాడు.

సరేనన్నాను. నాకూ ఒకసారి మా వూరినీ అక్కడి నా స్నేహితులనీ చూడాలని వుంది.

అప్పటి నుంచీ నేను మావూరు వెళ్లడం గురించి ఆలోచిస్తున్నాను. ఇలా ఆలోచిస్తున్నప్పుడు ఒకసారి మా వూళ్లో వుండే గోవిందు జిన్నాటవర్ సెంటర్‌లో కనబడి మావూరి విశేషాలు చెబుతూ మావూరి వేణుగోపాలస్వామి గుళ్లో మండల పూజలు మొదలయినాయని చెప్పాడు. మా వూరి గుళ్లో మానాన్న చిన్నతనంనుంచీ ఒక ఆనవాయితీ వుంది. ప్రతి సంవత్సరం వరుసగా నలభైరోజులపాటు ఆకుపూజలు చేయిస్తారు. ఈ టైములో వెళితే మేం కూడా ఆకు పూజ చేయించవచ్చును.

ఇలా అనుకున్న తర్వాత నా తమ్ముడికి ఫోన్ చేసి వెంటనే రమ్మని

చెప్పాను. మూడు రోజులు ఆఫీసుకు సెలవుపెట్టాను.

విరూపాక్ష వచ్చాడు. వాడూ నేనూ కలిసి పొద్దుటే మావూరికి బయల్దేరాం. బస్సు ఎక్కిన తర్వాత నాకో సందేహం కలిగింది. మా వూళ్లో మాకు సన్నిహితులయిన వాళ్లు ఎవరయినా వున్నారో? లేరో?

అక్కడకు వెళితే ఎవరింట్లో వుండాలి?

ఇబ్బంది పడతామా?

నా సందేహాన్ని విరూపాక్షతో చెప్పలేదు.

విరూపాక్ష చాలా సంతోషంగా కనిపించాడు. నాకూ సంతోషంగానే వుంది. ఒకనాటి మా ఇంటినీ, నేను ఆడుకున్న మైదానాన్నీ చూడవచ్చు.

ఊరి బయట బస్సుదిగాం. మావూళ్లోకి బస్సు వెళ్లదు. అడ్డరోడ్డునించి వూళ్లోకి నడక సాగించాం.

అంతగా వెడల్పులేని మట్టిరోడ్డు, రోడ్డుకు రెండువైపులా పీలగా వున్నా నీళ్లులేని కాలువ. రోడ్డు పక్కనే అంతగా ఎత్తుపెరగని చెట్లు. చెట్లు గాలికి కదులుతున్నప్పుడు ఎండిపోయిన కొమ్మలూ, ఆకూలూ, ఎండి నల్లగావున్న కాయలూ ఒకదాని కొకటి రాసుకొని గలగలమని చప్పుడు చేస్తున్నాయి.

చెట్లనీడ పడుతుండటం వల్ల ఎండ అంతగా తెలీడంలేదు. రోడ్డుమీద ఎవరో కొంతమంది ఎదురు వచ్చారుగానీ వాళ్లెవరో తెలీదు.

వెడల్పుగా వున్నా వాగుమీద ఇరకుగా వున్న చప్టాదాటి వూళ్లోకి వచ్చాం.

విరుపాక్ష ఆ ఇళ్లని వింతగా చూస్తున్నాడు. వాడికి బాగా కొత్తగా వుంది.


నాకు పాతరోజులు గుర్తుకువస్తున్నాయి. ఒకప్పుడు అదంతా నేను తిరిగిన ప్రదేశమే.

విరూపాక్ష చేతిలో వెడల్పుగా వున్న కర్రల సంచీ వుంది. దాన్నిండా ఆకుపూజకు అవసరమయినవన్నీ వున్నాయి.

ముందుగా మాకు బాగా సన్నిహితంగా వుండే వాళ్ల ఇంటికివెళ్లాము. అదృష్టం కొద్దీ వాళ్లు అక్కడే వున్నారు. ఊరు వదిలివెళ్లలేదు.

మా ఇద్దరి రాకవాళ్లకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

''మన వూరిగుళ్లో ఆకుపూజ చేయించడానికి



వచ్చాం'' అని చెప్పాను వాళ్ల ఆశ్చర్యానికి జవాబుగా-

ఆయన నవ్వి ''ఇంకా మన వేణుగోపాల స్వామిని మరచిపోలేదా?'' అన్నాడు. ఆయన పేరు కృష్ణమూర్తి. వాళ్లకు ఎద్దుల బండి, వ్యవసాయమూ వున్నాయి.

అప్పటికప్పుడే విరూపాక్షను తీసుకుని గుడిపూజారి వేణుగోపాలాచార్యుల గారింటికి వెళ్లాను. ఆయన ఇంట్లోనే వున్నాడు. ఆయనలో అంతగా మార్పులేదు. నన్ను వెంటనే గుర్తుపట్ట లేదు. గుర్తించిన తర్వాత ఆరోజు రాత్రి గుళ్లో ఆకు పూజ గురించి చెప్పాను.

ఆయన విరూపాక్ష చేతిలోని సంచీ అందుకొని ''ఎవరిపేరున చెయ్యమంటారు?'' అనడిగాడు.

నేను చెప్పేలోపునే విరూపాక్ష ''మా నాన్న పేరున చెయ్యండి'' అన్నాడు.

''ఇతనెవరు?'' అడిగాడాయన.

''మా తమ్ముడు''

''మా నాన్న పేరు...'' అని విరూపాక్ష అంటు న్నప్పుడు ఆయని నవ్వి'' అవసరంలేదు. మీ నాన్న నాకు బాగా తెలుసు'' అన్నాడు.

విరూపాక్ష కూడా నవ్వేడు.

''రాత్రి ఎనిమిది గంటలకు రండి'' అని చెప్పాడాయన మేం తిరిగి వసున్నప్పుడు.

మేం వచ్చేసరికి వంట పూర్తయ్యింది.

క్రిష్ణమూర్తిగారి భార్య, భర్తతోపాటు మా ఇద్దరికీ భోజనాలు వడ్డించింది. ఎప్పుడయినా కృష్ణమూర్తిగారు గుంటూరు వచ్చినప్పుడు మా ఇంట్లో వుండేవాడు.

భోజనం చేసిన అనంతరం మళ్లీ విరూపాక్ష, నేను బయటకు వచ్చాం. ఒకనాటి మా ఇంటిని చూపిం చాను. ఇంటి తలుపులు తెరిచివున్నాయి. బాగా పాతబడిపోయిన పెంకుటిల్లు.

విరూపాక్ష వాకిలి ఎదురుగా నిలబడి ఆసక్తిగా లోపలకు చూస్తున్నాడు. ఇప్పుడు ఆ ఇంట్లో ఎవరో వున్నారు. ఎవరో ఒకామె ఆ ఇంటి బయటకు వచ్చి ''ఎవరు కావాలి'' అనడిగింది.

విరూపాక్ష మాట్లాడకుండా పక్కకువచ్చాడు.

మా ఇంటిపక్కనే వున్నా బావిని విరూపాక్షకు చూపించి ''నాన్న రోజూ ఈ బావిలో నీళ్లనుతొడి ఇక్కడే స్నానం చేసేవాడు'' అని చెప్పాడు.

అప్పుడు వాడు ఆ బావిలోకి తొంగి చూశాడు. తర్వాత అక్కడే వున్నా బకెట్‌తో నీళ్లు తొడి కొంచెం నీళ్లను తలమీద చల్లుకుని ఇంకొంచెం నీళ్లను దోసిలితో పట్టుకుని తాగాడు.

వాడి చర్య నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

''అదేంట్రా ! ఇదేమైనా గంగాజలమా?'' అన్నాను.

''నాకు అంతకంటే ఎక్కువ. నాన్న తాకిన నీళ్లు, నాన్నతో అనుబంధం వున్నా ఏదయినా నాకు విలువైనదే, సాయంత్రం నేను కూడా ఇక్కడే స్నానం చేస్తాను'' అన్నాడు విరూపాక్ష కృతనిశ్చయంతో-

వాడిని చూస్తే బాధనిపించింది.

మా ఇంటిముందు పెద్ద మైదానం. ఆమైదానంలో రోజూ గంటలతరబడి ఆడుకునేవాళ్లం. మైదానాన్ని రోడ్డునీ వేరుచేస్తూ రోడ్డుపక్కనే చైనావాల్‌గా వెడల్పుగా వున్న పొడవాటి గోడ. అవసరం లేక పోయినా మధ్య మధ్యలో వాకిళ్లు.

ఆ రోడ్డు చివర్లో పెద్దమర్రి చెట్టు. ఆ వూరికి అదే సెంటరు. మర్రి చెట్టు పక్కనే బడ్డీకొట్టు. బడ్డీకొట్టు కింద నల్లగా వున్న నీళ్లతొట్టెలో సోడాసీసాలు వరు సగా పేర్చివున్నాయి.

''ఇంతకుముందు ఇక్కడ బడ్డీకొట్టు లేదు. ఇక్కడ ఈతాకుల చాపలు వేసుకుని నాన్న, గుడి పూజారి ఆచార్యులుగారు, గుడ్డి సుబ్బయ్య ఇంకొంతమంది రోజూ సాయంత్రం వేళ పేకాడే వాళ్లు. నాన్న చేతిలో జూదరేఖ వుందో ఏమో రోజూ నాన్నే గెలిచేవాడు. నా స్కూలు సెలవుల్లో నెల రోజులు ఇక్కడే నాన్న పక్కన కూర్చుని పేకాట నేర్చుకొన్నాను. నాన్న నా పేకాట గురువు'' అని చెప్పాను.

విరూపాక్ష నవ్వి ''నిన్ను చూస్తుంటే నాకు అసూయగా వుంది. నీ బదులు ముందుగా నేను పుట్టినా బావుండేది'' అన్నాడు.

తర్వాత తిరిగి వెళ్లాం.

ఒక గంట ముందుగానే విరూపాక్ష, నేను గుడికి వచ్చాం.

వేణుగోపాల స్వామికి దణ్ణం పెట్టుకుని బయ టకు వచ్చాం. గుళ్లో అప్పుడే భజన మొదలయ్యింది. బుచ్చిరామయ్యగారు హార్మోనియం మోగిస్తున్నారు. తాళాలు మోగుతున్నాయి. వీరయ్య మద్దెల కొడుతున్నాడు. చిన్న తనంలో నేను కూడా తాళాలు మోగించేవాడిని. ఇత్తడి తాళాలు మోగించడం అంటే అదో రకమయిన గౌరవం.

బయటకు వస్తున్నప్పుడు గుడిపక్క రోడ్డులో వుండే శ్రీరాములు ఎదురయ్యి కుశలప్రశ్నలు అడిగి ఆకుపూజ అయిన తర్వాత వాళ్లింటికి వస్తే తను కూడా కృష్ణమూర్తి గారింటికి వస్తానని చెప్పాడు.

సరేనని విరూపాక్షతో గుడిపక్కనే ఇరుగ్గా వున్నరోడ్డు మీదనుంచి గుడివెనుక వైపుకు వచ్చాము.

గుడి వెనుక చెరువు.

వెన్నెల విరగకాస్తోంది. వెన్నెల్లో చెరువు నీళ్లు మెరుస్తున్నాయి. చల్లనిగాలి వీస్తోంది.

''ఒరేయ్. నాన్న రోజూ ఈ చెరువునించే కావిడితో నీళ్లు తీసుకువచ్చేవాడు'' అని చెప్పాను వాడితో.

అప్పుడు వాడు నీళ్లలోకి దిగాడు. ప్రశాంత తను భంగపరిచినందుకు నీళ్లు విసుక్కున్న చప్పుడయ్యింది.

చెరువు ఎదురుగా గుడికి కొంచెం దూరంలో సత్రం వుంది. దాని ముందు పెద్ద వేపచెట్టు. అన్నీ అలాగే వున్నాయి. ఏమంత మార్పులేదు.

తిరిగి గుళ్లోకి వచ్చాం.

ఆకుపూజ జరుగుతోంది. గుళ్లోనించి అగరు వత్తుల పరిమళం బద్ధకంగా బయటకు వస్తోంది.

తొమ్మిది గంటలు కావస్తున్నప్పుడు పూజ పూర్తయ్యింది. భజన కూడా ఆగిపోయింది.

తీర్థం ప్రసాదం ఇచ్చారు.

గుళ్లోనించి బయటకువచ్చి గుడి పక్కనే వున్న ఇరుకు రోడ్డుమీద నడిచి గుడి వెనక్కు వచ్చాము.

గుడి మూల మీదకు వచ్చిన తర్వాత శ్రీరా ములుని కలవాలనే విషయం గుర్తుకువచ్చింది.

''ఒరేయ్ నువ్విక్కడే వుండు. నేను ఈ పక్కనే మా ఫ్రెండ్‌ను కలిసివస్తాను '' అని విరూపాక్షకు చెప్పాను. వాడు తలవూపాడు. అక్కడ స్ట్రీట్‌లైటు వెలుగుతోంది.

గుడిపక్కనే వున్న శ్రీరాములు ఇంటికి వెళ్లాను. అతను భోజనం చేస్తున్నాడు. భోజనమైనాక తనే కృష్ణమూర్తి గారింటికి నా దగ్గరకు వస్తానని చెప్పాడు.

వెనక్కు తిరిగాను.

గుడిమలుపు తిరిగే సరికి విరూపాక్ష ఆ స్ట్రీట్ లైటుకింద ఎవరితోనో మాట్లాడుతూ కనిపించాడు.

కొంచెం పరిశీలనగా చూసి షాక్ కొట్టినట్టు ఫీలయ్యాను. ఆయన పూర్తిగా మా నాన్నలాగానే వున్నాడు. పంచెకట్టుకుని పొడుగు చేతుల షర్టు వేసుకుని సగం వరకు మడుచుకున్నాడు. ఆయన తలపక్కకు తిప్పినప్పుడు దీపం కాంతి ఆయన మొహం నిండా పరుచుకున్నది. సందేహం లేదు. ఆయన మా నాన్నే. మా నాన్న అలాగే నిల్చునే వాడు.

ఆశ్చర్యంతో ముందుకు కదిలాను. ఆయన కూడా అక్కడినించి కదిలాడు.

''నువ్వు ఎవరితో మాట్లాడుతున్నావ్?'' విరూపాక్షను అడిగాను.

''ఆయన ఎవరో ఎటు నుండి వచ్చాడో తెలీదు. మనందరి గురించిన వివరాలూ అడుగుతున్నాడు. నాన్నకు బాగా స్నేహితుడట''

కృష్ణమూర్తి గారింటికి బయల్దేరుతూ గబగబా సత్రం వైపుకు వెళ్లాం. విరూపాక్ష కూడా నన్ను అనుసరించాడు. కానీ ఆయన కనిపించలేదు.

''ఇంతలోనే ఎక్కడికి వెళ్లివుంటాడు?'' అన్నాడు విరూపాక్ష. ''మాయమై వుంటాడు'' అన్నాడు.

''నిజంగానా!'' ఆశ్చర్యంగా అడిగాడు.

''సర్లేపద- కృష్ణమూర్తిగారు ఎదురు చూస్తూ వుంటారు''

తిరిగి ఇద్దరం నడుస్తున్నాం.

''నువ్వూ అదృష్టవంతుడివేరా'' అన్నాను.

''ఎందుకు?'' వాడు అడిగాడు.

''ఇంతకు ముందు స్ట్రీట్ లైటు కింద నీతో మాట్లాడిన మనిషి ఎవరనుకొన్నావ్?''

''ఎవరో నువ్వేచెప్పు''

''ఆయనే మన నాన్న, చాలా క్లియర్‌గా చూశాను'' అన్నాను. అప్పుడు విరూపాక్ష ఆగి పోయి తల పైకెత్తి చూస్తూ ''నాన్నా మళ్లీ కని పించు'' అని పిచ్చిపట్టినట్లు పెద్దగా అరిచాడు.

ముందు నడుస్తున్న ఇద్దరు మనుషులు ఆగిపోయి వెనక్కు తిరిగి చూశారు ఆశ్చర్యంతో.

★